RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 401 | 13 శనివారం జూన్ 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు

### : కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్



రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టులో చుక్కెదురైనప్పటికీ, ఇది తనకు ఎదురుదెబ్బ కాదని కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతోందో ఈ ఘటనతో బహిర్గతమైందని ఆమె వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలపై గౌరవం ఉందని, అందుకే కోర్టు తీర్పుపై నేరుగా స్పందించనని తెలిపారు. ఈ పరిణామం తనను షాక్‌కు గురిచేయలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై తమకు నమ్మకం లేదని, అయితే తమ న్యాయపరమైన వాదనలో ఎలాంటి బలహీనత లేదని ఆమె పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వేసిన తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. దీనిపై ఎన్నికల సంఘంలో పిటిషన్ ద్వారానే పరిష్కారం వెతుక్కోవాలని సూచించింది. 2022లో తెలంగాణలో నమోదైన ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో జూన్ 9న రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే, రెండేళ్లకు పైగా శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల వివరాలు మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని, ఈ కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని ఆమె తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు.

## క్రికెట్ ఆడిన మల్లారెడ్డి..

### మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలలో పాఠశాలల ప్రారంభోత్సవం



దీనికి కృతజ్ఞతగా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పాఠశాలలు ఏర్పాటు చేస్తామని వెల్లడి మేడ్చల్ నియోజకవర్గంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా మాజీ మంత్రి మల్లారెడ్డి సరికొత్త అడుగులు వేశారు. స్థానిక విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త విద్యా సంస్థలను ఆయన ప్రారంభించారు. మేడ్చల్, శామీర్‌పేట ప్రాంతాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్, మల్లారెడ్డి పాఠశాల బ్రాంచ్‌లను మల్లారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సరదాగా గడిపారు. వారితో క్రికెట్ ఆడి, అక్కడి వాతావరణంలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ మల్లారెడ్డి చేసిన సందడి అందరినీ ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సభలో మల్లారెడ్డి మాట్లాడుతూ... తనను వరుసగా మూడుసార్లు గెలిపించిన మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. వారికి కృతజ్ఞతగా వారి పిల్లలకు అతి తక్కువ ఫీజులతోనే నాణ్యమైన కార్పొరేట్ విద్యా సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఒక సీఎంఆర్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని పాఠశాలలను ప్రారంభిస్తామని, నాణ్యమైన విద్యను అందరికీ చేరువ చేయడమే తమ ఆశయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్లు శ్రీదేవి, శిరీష, మున్సిపల్ ఛైర్మన్ జామూ రవి, మాజీ లైబ్రరీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, జగన్ రెడ్డి, దయానంద్ యాదవ్, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### తెలంగాణలో నేడు పలు జిల్లాలకు

## వర్ష సూచన

వర్షాల రాకతో వేడి నుంచి ఉపశమనం పొందుతున్న ప్రజలు నైరుతి రుతుపవనాల ప్రభావంతో గత మూడు రోజులుగా తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్న సమయాల్లో అక్కడక్కడా ఎండ తీవ్రత కనిపిస్తున్నప్పటికీ, వాతావరణంలో వస్తున్న ఆకస్మిక మార్పుల వల్ల అనేక ప్రాంతాల్లో మబ్బులు పట్టి వర్షాలు పడుతున్నాయి.

వాతావరణ నిపుణుడు, వెదర్ మ్యాన్ బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం, ఈరోజు కూడా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కుమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. మరోవైపు, రుతుపవనాల రాకతో తీవ్రమైన వేసవి ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు పెద్ద ఉపశమనం లభించింది. పలు ప్రాంతాలలో వాతావరణం ఆహ్లాదకరంగా మారడమే కాకుండా, అప్పుడప్పుడు కురుస్తున్న జల్లులు ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి.

### బెంగాల్‌కు టాటాను

## తిరిగి తీసుకొస్తాం

### : సీఎం సువేందు అధికారి ప్రకటన



పశ్చిమ బెంగాల్‌లో పారిశ్రామిక పెట్టుబడులను తిరిగి పట్టాలెక్కించే పెట్టే దిశగా నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక ప్రకటన చేశారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం రాష్ట్రం నుంచి తరలివెళ్లిన టాటా గ్రూప్‌ను మళ్లీ వెనక్కి తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం కోల్‌కత్తాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "టాటాలను మేము తిరిగి బెంగాల్‌కు తీసుకువస్తాం" అని ప్రకటించారు. సుమారు 18 ఏళ్ల క్రితం సింగూర్‌లో టాటా నానో కార్ల ఫ్యాక్టరీ ఏర్పాటుపై తలెత్తిన వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. నాటి వామపక్ష ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తూ అప్పటి ప్రతిపక్ష నేత మమతా బెనర్జీ నేతృత్వంలో భారీ ఎత్తున ఉద్యమం జరిగింది. ఈ ఆందోళనల కారణంగా టాటా మోటార్స్ తన ప్రాజెక్టును గుజరాత్‌కు తరలించగా, ఈ పరిణామం బెంగాల్ పారిశ్రామిక రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో సువేందు అధికారి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. బలవంతపు భూసేకరణతో వామపక్ష ప్రభుత్వం, కేవలం ప్రచారానికే పరిమితమైన పరిశ్రమలతో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. తమ బీజేపీ ప్రభుత్వం అవినీతికి, మధ్యవర్తులకు తావులేకుండా పారదర్శక విధానాలతో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయం సాధించిన బీజేపీ, 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించిన విషయం విదితమే. గడిచిన మే నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారి, రాష్ట్ర పారిశ్రామిక పునరుజ్జీవనాన్ని ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా ప్రకటించారు.

### తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ

## పవన్ కల్యాణ్‌కు ఉంది

### : రేవంత్ రెడ్డి



తెలంగాణలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరైనా రాజకీయాలు చేయడానికి స్వేచ్ఛ ఉందని, పవన్ కల్యాణ్‌కు కూడా అదే వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ నిర్వహించాలనుకున్న బహిరంగ సభకు అనుమతి నిరాకరించిన అంశంపై స్పందించిన సీఎం... ఆ నిర్ణయం పూర్తిగా శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదేనని వివరించారు. ఇందులో రాజకీయ కోణం ఏదీ లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంపై ఎలాంటి ఆంక్షలు లేవని, నిబంధనల ప్రకారం ఎవరైనా తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగించవచ్చని తెలిపారు. ఇదే సమయంలో జాతీయ రాజకీయాలపై కూడా ఆయన స్పందించారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన అడ్డంకులు లేని పరిస్థితిలో నామినేషన్ తిరస్కరించడం ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాల అవకాశాలను పరిమితం చేసేలా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవస్థలు పనిచేయాలని రేవంత్ రెడ్డి సూచించారు.

### మీనాక్షి రాజ్యసభ నామినేషన్ వివాదంపై

## సిట్ విచారణ జరిపించండి

### : కేటీఆర్ ఎద్దేవా



కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అంశానికీ సిట్ దర్యాప్తులు ఏర్పాటు చేస్తోందని, అదే విధంగా ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ అభ్యర్థిత్వానికి సంబంధించిన వివాదంపైనా సిట్ విచారణ జరపాలని వ్యంగ్యం ప్రదర్శించారు. మీనాక్షి నటరాజన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లోనే కొందరు నాయకులు వ్యవహరించి ఉండవచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ అంశాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లింది కూడా కాంగ్రెస్ వర్గాలేనని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌లో ఉన్న అంతర్గత విభేదాలు, వర్గపోరాటాలే ఈ పరిస్థితులకు కారణమని పేర్కొన్నారు. పార్టీ ద్రోహులు ఎవరో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించాలని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ నగర సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్ నగరాల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. తాజాగా కురిసిన వర్షాలతో నగరంలో ఏర్పడిన పరిస్థితులు ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టాయని వ్యాఖ్యానించారు. అలాగే, కేంద్రం తీసుకురానున్న డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గేలా నిర్ణయాలు తీసుకుంటే బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## టీజీ ఐసెట్-2026 ఫలితాలు విడుదల




తెలంగాణలోని ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించిన టీజీ ఐసెట్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం 3:30 గంటలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఈ ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలతో పాటు అభ్యర్థుల ర్యాంకు కార్డులను కూడా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మే 13, 14 తేదీల్లో ఈ కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 56,000 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష అనంతరం మే 29న ప్రాథమిక కీని విడుదల చేసిన అధికారులు, తాజాగా తుది ఫలితాలను ప్రకటించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్ మరియు పుట్టిన తేదీ వివరాలను icet.tgche.ac.in అనే అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసి ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ర్యాంకు కార్డులో సెక్షన్ల వారీగా సాధించిన మార్కులు, మొత్తం నార్మలైజ్డ్ స్కోర్, ర్యాంకు వివరాలను పొందుపరిచారు. జూలై నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుంది.

# అమిత్ షా చెబుతున్న ఈ బియ్యం ప్రత్యేకత ఏంటి?

దేశంలో రక్తహీనత, పోషకాహార లోపాలను అరికట్టేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం (పోషకాలతో కూడిన బియ్యం) పంపిణీ ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకం కింద 80 కోట్ల మందికి ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాను 2028 డిసెంబర్ వరకు కొనసాగించాలని కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. ఈ నిర్ణయం వల్ల కోట్లాది మంది లబ్ధిదారుల ఆరోగ్యం స్థితిగతులు మెరుగుపడతాయని ఆయన సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు.

ఏమిటీ ఫోర్టిఫైడ్ బియ్యం?

ఫోర్టిఫైడ్ బియ్యం అంటే ప్రత్యేకమైన వంగడం ఏమీ కాదు. మనం రోజూ తినే సాధారణ బియ్యానికే ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ12 వంటి కీలక సూక్ష్మ పోషకాలను జోడిస్తారు. ఈ ప్రక్రియలో బియ్యం గింజలపై పోషకాల పూత పూయడం లేదా పోషకాలతో కూడిన గింజలను సాధారణ బియ్యంలో కలపడం జరుగుతుంది. ఈ బియ్యం రుచి, వాసన, రంగులో సాధారణ బియ్యంలాగే ఉంటాయి. వండినప్పుడు కూడా ఎలాంటి తేడా ఉండదు.

ఎందుకింత ప్రాధాన్యం?

భారత్‌లో మహిళలు, పిల్లలతో సహా అన్ని వయసుల వారిలో ఐరన్ లోపం వల్ల కలిగే రక్తహీనత (అనీమియా) తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా ఉంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-5) గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో చాలా మందికి అన్నమే ప్రధాన ఆహారం. ఇడ్లీ, దోశ, పులావ్, కిచిడీ వంటి ఎన్నో రకాలుగా బియ్యాన్ని ఉపయోగిస్తారు. అందుకే,



ప్రజల ఆహారపు అలవాట్లను మార్చకుండా, వారి రోజువారీ భోజనం ద్వారానే పోషకాలను అందించేందుకు ఫోర్టిఫికేషన్ ఒక సులభమైన, సమర్థవంతమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు ₹17,082 కోట్లు కేటాయించింది.

# ఢిల్లీ నుంచి నేరుగా మంగళూరుకు చేరుకున్న సీఎం విజయ్

ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి ఆధ్యాత్మిక పర్యటనకు తమిళనాడు సీఎం విజయ్ సిద్ధమయ్యారు. ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన నేరుగా కర్ణాటకలోని మంగళూరుకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఉడుపి జిల్లా పరిధిలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం కొల్లూరు శ్రీ మూకాంబిక అమ్మవారి ఆలయాన్ని సందర్శించనున్నారు. దక్షిణ భారతదేశంలో విశేష ప్రాధాన్యత కలిగిన ఈ దేవాలయానికి ప్రతి ఏడాది లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా ఆలయాన్ని దర్శించుకోనున్న విజయ్... ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు,



అభివృద్ధి కోసం ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారని సమాచారం. కొల్లూరు మూకాంబిక ఆలయానికి తమిళనాడుతో ప్రత్యేక అనుబంధం ఉంది. గతంలో తమిళ రాజకీయాల్లో దిగ్గజ నేతగా గుర్తింపు పొందిన ఎంజీఆర్ కూడా ఈ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి విలువైన ఖడ్గాన్ని కానుకగా అందించారు. నేటికీ ఆ ఖడ్గం ఆలయ సంపదలో భాగంగా భద్రపరచబడుతూ, ప్రత్యేక సందర్భాల్లో భక్తులకు ప్రదర్శించబడుతోంది. మరోవైపు, విజయ్ పర్యటన నేపథ్యంలో ఆలయ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీంతో కొల్లూరు పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. విజయ్ ఆలయ దర్శనానికి అభిమానులు, పార్టీ శ్రేణులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఎల్‌నినో ఎంట్రీ.. రాబోయే నెలల్లో మరింత తీవ్రరూపం!

భారత వర్షాకాలాన్ని ప్రభావితం చేసే కీలక వాతావరణ పరిణామమైన ఎల్‌నినో మళ్లీ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. ప్రస్తుతం కొనసాగుతున్న నైరుతి రుతుపవనాల కాలంలో ఈ ప్రభావం మరింత బలపడే అవకాశం ఉందని హెచ్చరించింది. దీంతో దేశవ్యాప్తంగా వర్షపాతం, వ్యవసాయం, నీటి లభ్యతపై ప్రతికూల ప్రభావం పడనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఐఎండీ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం భూమధ్యరేఖా పసిఫిక్ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని మించి పెరగడంతో ఎల్‌నినో పరిస్థితులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. వాతావరణ వ్యవస్థల్లో కూడా ఈ మార్పుల ప్రభావం కనిపించడం ప్రారంభమైందని తెలిపింది. రాబోయే నెలల్లో ఈ పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముందని అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాలు అసాధారణంగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియే ఎల్‌నినో. భారతదేశంలో ఇది అత్యంత కీలకమైన అంశంగా పరిగణిస్తారు. ఎందుకంటే గతంలో ఎల్‌నినో ప్రభావం ఉన్న సంవత్సరాల్లో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదవడం, వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం వంటి పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావానికి గురయ్యే అత్యంత సున్నితంగా ఉన్న 197 జిల్లాలను గుర్తించామన్నారు. వాటి కోసం రాష్ట్రాలవారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి వారం పరిస్థితిని సమీక్షిస్తున్నామని, అవసరమైన విత్తనాలు, వ్యవసాయ సామగ్రిని ముందుగానే నిల్వ చేశామని వెల్లడించారు. రైతుల్లో అవగాహన పెంచేందుకు 'ఖేత్ బచావో అభియాన్' పేరుతో దేశవ్యాప్త కార్యక్రమాన్ని



కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణ సగటు వర్షపాతం కంటే సుమారు 90 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే అంచనా వేసింది. ఎల్‌నినో ప్రభావం పెరిగితే రుతుపవనాల సీజన్ రెండో భాగంలో వ్యవసాయ రంగానికి మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఉత్తర కొరియాపైకి డ్రోన్లు: మాజీ అధ్యక్షుడికి 30 ఏళ్ల జైలు శిక్ష

దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు న్యాయస్థానంలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగాంగ్‌పైకి సైనిక డ్రోన్లను పంపిన కేసులో సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఆయనకు శుక్రవారం 30 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. దేశంలో విధించిన మార్షల్ లా (సైనిక పాలన) విఫలం కావడంతో ఓ సాకును సృష్టించే ఉద్దేశంలో భాగంగా యూన్ ఈ డ్రోన్ల దాడికి ఆదేశించారని కోర్టు నిర్ధారించింది.

2024 అక్టోబర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో యూన్ పాత్ర స్పష్టంగా ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది. శత్రువులకు సహకరించడం, అధికార దుర్వినియోగం వంటి అభియోగాల కింద ఆయనను దోషిగా తేల్చింది. ఈ కేసులో యూన్‌తో పాటు మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్-హ్యూన్‌కు కూడా 30 ఏళ్ల శిక్ష పడగా, మరికొందరు సైనికాధికారులకు స్వల్పకాలిక శిక్షలను కోర్టు ఖరారు చేసింది.

కాగా, 2024 చివర్లో మార్షల్ లా విధించి తిరుగుబాటుకు యత్నించిన కేసులో యూన్ సుక్ యోల్ ఇప్పటికే యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. నాడు ఆయన మార్షల్ లా విధించారు. కానీ ప్రజాప్రతినిధులు సహా అందరి నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలో దానిని విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయన అభిశంసనకు గురై పదవిని కోల్పోయారు. ఉత్తర కొరియాను రెచ్చగొట్టి, ఆ దేశం నుంచి ప్రతిస్పందన రాబట్టేందుకే 10కి పైగా డ్రోన్లను పంపారని ప్రాసిక్యూటర్లు వాదించారు. తద్వారా ఉద్రిక్తతలు సృష్టించి, రాజకీయ ప్రత్యర్థులను దేశ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించి మార్షల్ లా



విధించే పన్నాగం పన్నారని ఆరోపించారు. అయితే, యూన్ తరపు న్యాయవాదులు ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. ఉత్తర కొరియా ప్రయోగించిన చెత్త బెలూన్ల వంటి కవ్వింపు చర్యలకు ప్రతిస్పందనగానే డ్రోన్లను పంపామని, ఈ తీర్పుపై అప్పీల్ చేస్తామని వారు పేర్కొన్నారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో ఈ కేసు విచారణ చాలావరకు రహస్యంగా సాగింది.

## ముంబైలో ఖర్చులు భరించలేను.. హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతివ్వండి: బాంబే హైకోర్టును ఆశ్రయించిన వరవరరావు

భీమా కోరేగావ్-ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడైన ప్రముఖ విప్లవ కవి, 85 ఏళ్ల పి. వరవరరావు దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. తన నివాసాన్ని ముంబై నుంచి హైదరాబాద్‌కు మార్చుకునేందుకు అనుమతించాలని కోరుతూ ఆయన ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండు వారాల్లోగా స్పందన తెలియజేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఆదేశిస్తూ న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అజయ్ గడ్కరీ, జస్టిస్ కమల్ ఖాతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ముంబైలో నివాసం ఉండటం ఆర్థికంగా పెనుభారంగా మారిందని, వృద్ధాప్యంలో ఇక్కడి జీవన వ్యయాన్ని భరించలేకపోతున్నానని వరవరరావు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన నెలవారీ పింఛను సుమారు రూ. 50,000 ఉండగా, ముంబైలో జీవన వ్యయం రూ. 77,000 దాటుతోందని, ఇది తనకు భారంగా మారిందని ఆయన వివరించారు. భీమా కోరేగావ్ కేసులో బెయిల్ పొందిన వరవరరావు, కోర్టు అనుమతి లేకుండా గ్రేటర్ ముంబై పరిధిని దాటి వెళ్లరాదన్న షరతుపై ప్రస్తుతం అక్కడే నివసిస్తున్నారు. ఇదే అభ్యర్థనతో ఆయన గతంలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది మార్చి 16న ఆ పిటిషన్ తిరస్కరణకు గురైంది. సుప్రీంకోర్టు విధించిన బెయిల్ షరతులను సవరించే అధికారం తమకు లేదని ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. 2018 ఆగస్టులో అరెస్టయిన



వరవరరావుకు, ఆరోగ్యం క్షీణించడంతో 2021లో బాంబే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం 2022లో సుప్రీంకోర్టు వైద్య కారణాలతో ఆయన బెయిల్‌ను ఖరారు చేసింది. తాజాగా ఎన్ఐఏ తన ప్రత్యుత్తరాన్ని దాఖలు చేసిన తర్వాత ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జరగనుంది.

# ఇరాన్‌తో ట్రంప్ ఒప్పందంలో ప్రపంచాన్ని మార్చే 5 కీలక హామీలు?



అమెరికా-ఇరాన్ మధ్య నెలలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. యుద్ధ హెచ్చరికలు, చమురు సరఫరాపై ఆందోళనలు, పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఓ చారిత్రక ఒప్పందం దిశగా చర్చలు జరుగుతున్నాయని త్వరలోనే దీనికి తుది రూపు దక్కవచ్చని వెల్లడించారు. ఈ నేపథ్యంలో బ్లూమ్‌బర్గ్, ఆక్సియోస్ కథనాల ప్రకారం ప్రతిపాదిత అవగాహన ఒప్పందంలో ఐదు కీలక అంశాలు ఉన్నాయి.

1. హార్మూజ్ ఓపెన్

ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతం వాటా ఉన్న హార్మూజ్ జలసంధిని ఇరాన్ పూర్తిగా తెరవడానికి అంగీకరించినట్లు సమాచారం. ఒప్పందం అమల్లోకి వచ్చిన 30 రోజుల్లోపు వాణిజ్య నౌకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా రాకపోకలు సాగేందుకు అనుమతించనుంది. ప్రపంచ ఇంధన మార్కెట్లకు ఇది భారీ ఊరటనివ్వొచ్చు.

2. ఇరాన్‌పై ఆంక్షల సడలింపు

ఇరాన్‌పై విధించిన కొన్ని ఆంక్షలను అమెరికా ఎత్తివేయనుంది. ముఖ్యంగా చమురు ఎగుమతులపై ఉన్న పరిమితులు సడలే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి. దీంతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊతం లభించే అవకాశముంది.

3. మరో 60 రోజుల కాల్పుల విరమణ

ప్రస్తుతం అమల్లో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని మరో 60 రోజుల పాటు పొడిగించేందుకు ఇరు దేశాలు సిద్ధమైనట్లు సమాచారం. ఈ వ్యవధిలో విస్తృత స్థాయి చర్చలు కొనసాగి శాశ్వత పరిష్కారానికి మార్గం సుగమం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

4. అణ్వాయుధాలపై ఇరాన్ హామీ

అణ్వాయుధాల అభివృద్ధి దిశగా వెళ్లబోమని ఇరాన్ హామీ ఇవ్వనుంది. అలాగే యురేనియం నిల్వలు, అణు కార్యక్రమ భవిష్యత్తుపై చర్చలకు అంగీకరించనున్నట్లు తెలుస్తోంది. అయితే అణు ఒప్పందానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై ఇంకా ప్రత్యేక చర్చలు జరగాల్సి ఉంది.

5. అమెరికా బలగాల ఉపసంహరణ

ఇరాన్ చాలా కాలంగా కోరుతున్న అంశాల్లో ఒకటైన అమెరికా సైనిక బలగాల ఉపసంహరణ కూడా ప్రతిపాదిత ఒప్పందంలో చోటు దక్కినట్లు సమాచారం. ఇరాన్ చుట్టుపక్క ప్రాంతాల నుంచి అమెరికా సైనిక వనరులను తగ్గించేందుకు వాషింగ్టన్ సిద్ధపడినట్లు నివేదికలు సూచిస్తున్నాయి.

ప్రపంచంపై ప్రభావం?

ఈ ఒప్పందం కార్యరూపం దాల్చితే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడంతో పాటు ప్రపంచ చమురు మార్కెట్లలో స్థిరత్వం నెలకొనే అవకాశం ఉంది. హార్మూజ్ జలసంధి తిరిగి పూర్తిస్థాయిలో తెరుచుకోవడం, ఇరాన్‌పై ఆంక్షల సడలింపు వంటి అంశాలు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ప్రజల తీర్పే చరిత్రను మార్చింది..

## ఏపీ పునర్నిర్మాణానికి కూటమి కట్టుబడి ఉంది

### : పవన్ కల్యాణ్



ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని, వారి తీర్పును మించిన శక్తి ఏదీ లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం ప్రభుత్వ మార్పునకు మాత్రమే పరిమితం కాలేదని, రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త దిశను నిర్దేశించిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి సమీపంలోని దామినేడులో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం' బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చారిత్రక విజయానికి కారణమైన ప్రజలకు, కూటమి శ్రేణులకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. "రెండేళ్ల క్రితం ప్రజలు మాకు కేవలం అధికారాన్ని ఇవ్వలేదు.. ఒక పెద్ద బాధ్యతను అప్పగించారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితం. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం కూటమి ఏర్పడింది. అధికారాన్ని పంచుకోవడం కోసం కాదు.. బాధ్యతను పంచుకోవడం కోసం ఈ కూటమి ముందుకొచ్చింది" అని పవన్ అన్నారు. జనసేన కేవలం 21 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, ప్రజల ఆశీర్వాదంతో అన్ని స్థానాల్లో విజయం సాధించడం తమపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధికి కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఎన్‌డీయే ప్రభుత్వ సమష్టి కృషి వల్ల విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోగలిగామని తెలిపారు. దేశంలో అత్యధిక కాలం నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఇటీవల జరిగిన విశాఖ స్టీల్ ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని పవన్ పేర్కొన్నారు. ఆ దుర్ఘటన కారణంగానే ఈ నెల 9న జరగాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేసి ఇప్పుడు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## నిరుద్యోగులకు శుభవార్త: ఏపీలో 529 వైద్య పోస్టుల భర్తీకి ప్రకటన



ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగార్థులకు వైద్య, ఆరోగ్య శాఖ తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో, కాంట్రాక్టు ప్రాతిపదికన 419 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ జూన్ 13, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఈ నోటిఫికేషన్ ద్వారా స్టాఫ్ నర్సు పోస్టులతో పాటు 24 ఫార్మసిస్ట్, 86 మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. మొత్తంగా 529 పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైంది. ఎంపికైన అభ్యర్థులను పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (UPHC), ప్రభుత్వ ఆసుపత్రులు, నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు (NICU), జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ల వంటి వివిధ విభాగాలలో నియమించనున్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ నియామక ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం (11వ తేదీ) వెలువడిన ఈ ప్రకటన ప్రకారం, అర్హులైన అభ్యర్థులు జూన్ 30, 2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు మరియు ఎంపిక విధానానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లను సందర్శించాలని అధికారులు సూచించారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
13 శనివారం జూన్ 2026

# పశువైద్య సేవలు అందక రైతుల ఆవేదన

## తక్షణమే వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని గ్రామస్తుల విజ్ఞప్తి



మెదక్,జూన్12(హైద్రాబాద్ ఎస్టేట్):
మెదక్ జిల్లా, పాపన్నపేట మండల పరిధిలోని అన్నారం గ్రామంలో బర్రెలు దూడలు, పశువులు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నప్పటికీ పశువైద్య సేవలు సకాలంలో అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామ పరిసర ప్రాంతాల్లో పశువులు అనారోగ్యానికి గురవుతున్నప్పటికీ సంబంధిత వెటర్నరీ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పశు సంరక్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పలుమార్లుయూసఫ్ పేట పశు సంరక్షణ కేంద్రానికి వెళ్లినా అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడం వల్ల చికిత్స పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు.ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వైద్యుడు డిప్యుటేషన్‌పై మెదక్‌కు వెళ్లినట్లు సమాచారం ఉందని గ్రామస్తులు తెలిపారు.అన్నారం గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు వెటర్నరీ సేవలు సక్రమంగా అందకపోవడంతో అనారోగ్యానికి గురైన పశువులు మరణించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పశుసంరక్షకులు ఆవేదన వ్యక్తం చేశారు.పశువులు రైతులకు ప్రధాన ఆస్తి కావడంతో వాటి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న వైద్య పోస్టును భర్తీ చేయడంతో పాటు శాశ్వత వెటర్నరీ డాక్టర్‌ను నియమించి పశువైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు, రైతులు విజ్ఞప్తి చేశారు.దీంతో పశువుల ప్రాణనష్టం నివారించడంతో పాటు రైతులకు ఊరట కలుగుతుందని వారు పేర్కొన్నారు.

# శ్రీధర్ బాబు మృతిపై కుటుంబం ఆవేదన.. పూర్తి స్థాయి విచారణకు డిమాండ్

## ఉద్యోగి మృతి వెనుక అసలు కారణాలేమిటి?.. బాధిత కుటుంబం కీలక ఆరోపణలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 12:-
రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన సేవలందించిన శ్రీధర్ బాబు మృతి ఘటనపై ఆయన కుటుంబ సభ్యులు స్పందించారు. ఇటీవల చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించిన పలు అంశాలను వారు మీడియా దృష్టికి తీసుకువచ్చారు.
శ్రీధర్ బాబుపై ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి ఆరోపణలు వచ్చినప్పటికీ, కార్యాలయంలో పరిమిత బాధ్యతలు నిర్వహించే ఉద్యోగి స్థాయిలో ఉన్న వ్యక్తి స్వతంత్రంగా పెద్ద మొత్తాల లావాదేవీలు నిర్వహించడం సాధ్యమేనా అనే సందేహాలను కుటుంబ సభ్యులు వ్యక్తం చేశారు. కార్యాలయ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండా అలాంటి చర్యలు జరిగే అవకాశం లేదని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు భార్య మాట్లాడుతూ, ఉద్యోగ నిర్వహణలో ఎదురైన ఒత్తిళ్లు మరియు మానసిక ఆందోళనలే తన భర్తను తీవ్ర నిరాశకు గురిచేశాయని ఆరోపించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆమె కోరారు.
అలాగే కుటుంబం ప్రస్తుతం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందని పేర్కొంటూ, తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.



కాగా, కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై సంబంధిత అధికారుల స్పందన ఇంకా వెలువడాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో తేలనున్నాయి.

# కొబ్బరికాయ కొట్టి సిసి రోడ్ల నిర్మాణం మొదలుపెట్టిన సర్పంచ్ బండారి లింగం



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూన్ 12
పాల్గొన్న ప్యాక్స్ చైర్మన్, వార్డు మెంబర్లు మహేశ్వరం నియోజకవర్గం నాగారం గ్రామంలోని 7, 8 వార్డుల్లో శుక్రవారం ఉదయం సిసి రోడ్ల నిర్మాణ పనులు షురూ అయ్యాయి. మన సర్పంచ్ బండారి లింగం కొబ్బరికాయ కొట్టి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. 7వ వార్డు రోడ్డు పనులను రూ. 10 లక్షల వ్యయంతో, అలాగే 8వ వార్డు అంతర్గత రోడ్డు పనులను రూ. 5 లక్షల నిధులతో చేపడుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండారి లింగం మాట్లాడుతూ..మన గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రతి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మన నాగారం గ్రామాన్ని నియోజకవర్గంలోనే అగ్రగామిగా, ఒక మోడల్ విలేజ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, రోడ్డు పనులను బాధ్యతాయుతంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను సర్పంచ్ లింగం కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్యాక్స్ చైర్మన్ మంచె పాండు మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధికి సిసి రోడ్ల నిర్మాణం ఎంతో దోహదపడుతుందన్నారు. మన గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు నయీమ్ ఖాన్, షాబుద్దీన్ ఖాన్, గణపురం మహేందర్, తలారి రాజు, కొర్ర రవీందర్, కొర్ర కవిత సురేశ్ లతో పాటు మాజీ ఉప సర్పంచ్ లతీఫ్ ఖాన్, కృపానందం, BRS శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి ముందస్తు సన్నాహాలు.. కొత్తూరు అండర్‌పాస్‌ను పరిశీలించిన ట్రాఫిక్ డీసీపీ

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తం.. జాతీయ రహదారిపై భద్రతా చర్యలకు ఆదేశాలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 12:-
షాద్‌నగర్: వర్షాకాలంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లను సమీక్షించేందుకు ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శివం ఉపాధ్యాయ్ ఐపీఎస్, షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-44పై ఉన్న కొత్తూరు వై-జంక్షన్ అండర్‌పాస్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు చెందిన సాంకేతిక నిపుణులు, అధికారులు పాల్గొన్నారు. పరిశీలన సందర్భంగా అండర్‌పాస్ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు నీరు నిలిచిపోయే అవకాశం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా తక్కువ ఎత్తు గల వాహనాలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని అధికారులు అభిప్రాయపడ్డారు. అలాగే కాలువల్లో పేరుకుపోయిన మట్టి, నిర్మాణ వ్యర్థాలు, తాత్కాలిక అడ్డంకులు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నట్లు గుర్తించారు. కొంతమేర బహిర్గతమైన విద్యుత్, కమ్యూనికేషన్




కేబుళ్లు మరియు కొనసాగుతున్న నిర్మాణ పనులు వర్షాల సమయంలో ప్రమాదకర పరిస్థితులకు దారితీయవచ్చని సూచించారు.
ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు అండర్‌పాస్ పరిసరాల్లోని నీటి పారుదల మార్గాలను తక్షణమే శుభ్రపరచాలని, వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించే హెచ్చరిక బోర్డులు, భద్రతా అవరోధాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి నీటి మట్టం ప్రమాద స్థాయికి చేరుకున్నప్పుడు వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేయాలని, వాహనాల రాకపోకలను నియంత్రించే ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో నిలిచిపోయిన వాహనాలను తొలగించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు.
వర్షాకాలంలో వాహనదారులు నీటి లోతు తెలియని అండర్‌పాస్‌లలో ప్రయాణించకుండా జాగ్రత్తలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నీటితో నిండిన మార్గాలను పూర్తిగా నివారించాలని సూచించారు. రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, పోలీసుల సూచనలను అనుసరించాలని కోరారు. అదేవిధంగా వర్షాకాల ప్రయాణాలకు ముందు వాహనాల్లో బ్రేకులు, వైపర్లు, హెడ్‌లైట్లు, టెయిల్‌లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలు తగ్గించేందుకు అన్ని అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



మాదిగ మాతృ శక్తి (మాదిగ శక్తి అనుబంధము ) మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలిగా తగరం రజిత, హన్మకొండ జిల్లా అధ్యక్షురాలిగా మిట్టపెల్లి రాధిక ల నియామకం
మాదిగ మాతృశక్తి రాష్ట్ర అధ్యక్షురాలు మద్దెల భవాని
మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరి సురేందర్ మాదిగ గారి ఆదేశాల మేరకు ఈ రోజు మాదిగ మాతృశక్తి మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలిగా తగరం రజిత గారిని, హన్మకొండ జిల్లా అధ్యక్షురాలిగా మిట్టపెల్లి రాధిక గార్లను నియమించడం జరిగింది.
అన్నివర్గాల, అన్ని మతాల ప్రజల తో మమేకమౌతు ఎవరి హక్కులకు భంగం కలుగకుండా అన్ని వర్గాల ప్రజల హక్కులను కాపాడుచు అసంగటిత రంఘాలలో ఉన్నటువంటి మహిళలను మాదిగ శక్తి సుస్థిర లక్ష్యాలకు అనుగుణంగా రాజ్యాధికారం వైపు నడిపించుట కొరకు గ్రామ స్థాయినుండి మాదిగ మాతృ శక్తి (మాదిగ శక్తి అనుబంధ ) కమిటీలను ఏర్పాటు చేయ వలసిన భాద్యత వీరీ పైన ఉన్నదని తెలియ జేస్తూ ఈ నియామకాలను చేయడం జరిగినది.
మద్దెల భవాని
రాష్ట్ర అధ్యక్షురాలు
మాదిగ మాతృశక్తి (మాదిగ శక్తి అనుబంధం)
91003 65145

# సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో జాప్యానికి చెక్.. పెండింగ్ అంశాల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

## భూసేకరణ, పునరావాస ప్రక్రియలను వేగవంతం చేయాలి అధికారులకు కమిషనర్ ఆదేశం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 12:-
రంగారెడ్డి జిల్లా,లో అమలవుతున్న ప్రధాన నీటిపారుదల పథకాల పనులను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రెవెన్యూ పునరావాస, పునర్వ్యవస్థీకరణ మరియు భూసేకరణ విభాగం కమిషనర్ కె. శివకుమార్ నాయుడు సంబంధిత అధికారులకు సూచించారు. భూముల స్వాధీనం, నిర్వాసితుల పునరావాసం, ఆర్థిక సాయాల పంపిణీ వంటి అంశాల్లో ఉన్న పెండింగ్ వ్యవహారాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.
జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయ సముదాయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరైన కమిషనర్‌కు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి అనంత్ రెడ్డి, పరిపాలనాధికారి సునీల్ స్వాగతం పలికారు.
తదుపరి జరిగిన సమావేశంలో జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన ఎత్తిపోతల, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల అమలు పరిస్థితిని ఆయన పరిశీలించారు. భూముల స్వాధీన ప్రక్రియ, పరిహారాల విడుదల, పునరావాస కేంద్రాల ఏర్పాటు, వివాదాస్పద కేసుల పరిష్కారం తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులతో సమగ్రంగా చర్చించారు.
ప్రాజెక్టుల అమలుకు అడ్డంకిగా మారుతున్న సమస్యలను వెంటనే గుర్తించి, వాటి నివారణకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చేపడుతున్న ఈ సాగునీటి పథకాలు నిర్దేశించిన సమయానికి పూర్తి కావాలంటే అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కమిషనర్




పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, తహసీల్దార్లు మరియు ఇతర విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విశాఖ మెరైన్ ఇంజినీర్ మృతిపై పవన్ కల్యాణ్ ఏమన్నారంటే...!



పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నడుమ జరిగిన ఓ ఘోర ఘటనలో విశాఖపట్నానికి చెందిన మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేష్ ప్రాణాలు కోల్పోయారు. ఒమన్ తీరానికి సమీపంలో భారత నౌకపై అమెరికా దళాలు జరిపిన దాడిలో ఆయన మరణించడం తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దురదృష్టకర ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు."భారత నౌకపై అమెరికా దళాలు జరిపిన దాడిలో విశాఖపట్నానికి చెందిన మెరైన్ ఇంజినీర్ పట్నాల సురేష్ గారు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. ఒమన్ తీరానికి సమీపంలో జరిగిన ఈ దురదృష్టకర ఘటనలో ఆయన మరణించారన్న వార్త నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి, ఆవేదనకు గురిచేసింది.పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ దుర్ఘటన చోటుచేసుకోవడం చాలా బాధాకరం. సురేష్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ కష్టకాలంలో ప్రభుత్వం ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుంది. వారిని ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని హామీ ఇస్తున్నాను" అని పవన్ తన ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఆర్యవైశ్యుల సేవలు అమూల్యం: మల్ రెడ్డి రంగారెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 12:-
హైదరాబాద్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం మరియు ఎన్నికైన ప్రజాప్రతినిధుల సన్మాన సభలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, వాణిజ్య రంగ పురోగతిలో ఆర్యవైశ్య సమాజం విశిష్టమైన సేవలు అందిస్తోందని పేర్కొన్నారు.
చిన్న వ్యాపారాల నుంచి భారీ పారిశ్రామిక సంస్థల వరకు అనేక రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ వస్తువుల సరఫరా వ్యవస్థను సమర్థంగా నడిపించడంలో ఈ వర్గం కీలక బాధ్యతలు నిర్వర్తిస్తోందని ఆయన తెలిపారు. సమాజ అవసరాలను తీర్చడంలో వారి కృషి ఎంతో విలువైనదని అన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి టీజీ వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే బీగాల గణేశ్ గుప్తా, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన ఆర్యవైశ్య వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులను సభలో సత్కరించారు. అనంతరం సంఘం కొత్త కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.
ఎన్నికైన ప్రతినిధులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని తమ ప్రధాన లక్ష్యంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వ్యాపార రంగంలో నైతిక విలువలను పాటిస్తూ సంపాదనలో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించే సంప్రదాయం ఈ వర్గంలో బలంగా ఉందని ఆయన చెప్పారు.
రాష్ట్ర ఖజానాకు పన్నుల రూపంలో గణనీయమైన ఆదాయం అందించడంలోనూ ఈ వర్గం పాత్ర విశేషమని, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అది పరోక్షంగా దోహదపడుతోందని గుర్తుచేశారు. ఆర్యవైశ్య సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు కూడా ఉన్నాయని, వారి అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
13 శనివారం జూన్ 2026

## బీసీ హక్కుల సాధన కోసం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన పల్నాటి యాదయ్య

### ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల,బీసీ సబ్ ప్లాన్ చట్టం,ప్రత్యేక నిధుల కేటాయింపుపై డిమాండ్

( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరంప్రతినిధి కృష్ణ చారి జూన్ 12:)

బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కమిటీ ఆధ్వర్యంలో మహేశ్వరం తహసీల్దార్ అప్పలనాయుడు కి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య మాట్లాడుతూ, కాలేజీ మరియు పాఠశాల విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2,500 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని,బీసీ సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకువచ్చి నిధుల వినియోగానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలని కోరారు.పేద విద్యార్థులు విద్యకు దూరం కాకుండా పెండింగ్ ఫీజులను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి విద్య, ఉపాధి అవకాశాలను పెంచాలని, చిన్న తరహా బీసీ వ్యాపారులకు బ్యాంకులతో సంబంధం లేకుండా ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.జనగణనలో కులగణనను గ్రామస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు 26 శాతం రిజర్వేషన్లు కల్పించాలని,రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మహిళలకు నెలకు రూ.2,500,వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4,000,వికలాంగులకు రూ.6,000 పింఛన్ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాపోలు రమేష్,బ్రహ్మచారి,రాములు, ఈశ్వరయ్య,పి.రాజేష్,జి.శ్రీను,ఎం.రాకేష్,వై. బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భూసర్వే పనుల వేగవంతానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక సమీక్ష

### సర్వేయర్లకు విధి నిర్వహణపై మార్గదర్శకాలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 12:-

రంగారెడ్డి జిల్లాలో భూ కొలతలు, పునఃసర్వే మరియు భూసేకరణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి జిల్లా పరిపాలన కీలక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో భూ కొలతల బాధ్యతలు నిర్వర్తిస్తున్న గుర్తింపు పొందిన సర్వేయర్లతో అధికారులు విస్తృతంగా చర్చించారు. జిల్లాలో ఎంపికైన సర్వేయర్లకు వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలులో వారి పాత్ర, బాధ్యతలు మరియు పనితీరు ప్రమాణాలపై స్పష్టమైన సూచనలు అందించారు. ముఖ్యంగా పునఃసర్వే కార్యక్రమంలో నిర్దేశిత విస్తీర్ణాన్ని పూర్తి చేసిన వారికి ప్రోత్సాహకంగా ప్రత్యేక పారితోషికం అందజేయనున్నట్లు వివరించారు. నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించి పనులు పూర్తి చేసిన వారికి అధిక మొత్తంలో ప్రోత్సాహక వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా భూముల కొలతల ప్రక్రియలో ఎకరాకు నిర్ణయించిన చెల్లింపులు, నెలవారీ లక్ష్యాలు మరియు పని పూర్తి చేయాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ సంబంధిత కార్యక్రమాల్లో సర్వేయర్లు కీలక బాధ్యతలు నిర్వర్తించాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో భూ రికార్డుల నవీకరణ, పునఃసర్వే, భూసేకరణ వంటి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన



మార్గదర్శకాలను అందించారు. జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ సమావేశం విజయవంతంగా ముగిసింది.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో డ్రగ్స్ ముఠా బట్టబయలు.

### రూ. కోటీ విలువైన మత్తు పదార్థాలు, సామగ్రి స్వాధీనం

### మామిడి తోటలో గుట్టుచప్పుడు కాకుండా మత్తు పదార్థాల తయారీ..ఇద్దరు నిందితుల అరెస్ట్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూన్ 12:-

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ ఈగల్ ఫోర్స్, హైదరాబాద్ మాదక ద్రవ్యాల నియంత్రణ విభాగం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో అక్రమంగా మత్తు పదార్థాలు తయారు చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఆపరేషన్‌లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని, సుమారు రూ. కోటి విలువైన మత్తు పదార్థాలు, రసాయనాలు, తయారీ పరికరాలు మరియు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన కీసరి మత్స్యగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన నిమ్మల నరేశ్‌లు మాదక ద్రవ్యాల తయారీ, రవాణా కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడు మత్స్యగిరిపై గతంలోనూ మాదక ద్రవ్యాల తయారీతో పాటు పలు నేర కేసులు నమోదై ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నిందితులు ఇటీవల ఒక మామిడి తోటలో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేసి, అక్కడ రహస్యంగా మత్తు పదార్థాల తయారీ చేపట్టినట్లు విచారణలో వెల్లడైంది. తయారుచేసిన మాదక ద్రవ్యాలను విక్రయాల కోసం తరలిస్తుండగా జూన్ 10, 11 తేదీల అర్ధరాత్రి సమయంలో బాటసింగారం సమీపంలో పోలీసులు వారిని పట్టుకున్నారు.

ఈ దాడుల్లో సుమారు 750 గ్రాముల మత్తు పదార్థం, దాని తయారీకి ఉపయోగించే రసాయనాలు, యంత్ర పరికరాలు, వాహనం మరియు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసిన వస్తువుల విలువ సుమారు రూ. కోటి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

ఈ ఘటనపై మాదక ద్రవ్యాల నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

మాదక ద్రవ్యాల అక్రమ తయారీ, రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల నిర్లక్ష్యం

### - డా అఖిల డ్యూటీ డాక్టర్ వెంటనే సస్పెండ్ చేయాలి
### - డా జగన్నాథం డెంటల్ డాక్టర్ తక్షణమే సస్పెండ్ చేయాలి
### - జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించాలి
### - జిల్లా మెడికల్ అధికారి తక్షణమే స్పందించాలి
### - Vck రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ డిమాండ్

చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నటువంటి డాక్టర్లు వివిధ గ్రామాల్లో ఉన్న నిరుపేద ప్రజలు వైద్యం కోసం హాస్పిటల్ కి వస్తున్న క్రమంలో ప్రజల అనారోగ్య సమస్యలు చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా మేం చెప్పిన వైద్యమే మీరు చేసుకోవాలని అమాయకమైన ప్రజలను బెదిరిస్తూ భయాందోళనకు గురి చేస్తూ అవమానిస్తున్న అటువంటి పరిస్థితి ప్రజలు వారి సమస్యలు చెప్పుకునే అవకాశం ఇవ్వకుండా బయటకు వెళ్లిపోండని దురుసుగా మాట్లాడుతున్నటువంటి దుస్థితి అలాగే ఆసుపత్రిలో వైద్యం చేయకుండా వంద పడకల ఆసుపత్రికి పంపిస్తున్నారు చిట్యాల ప్రభుత్వ డాక్టర్స్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నటువంటి డాక్టర్ అఖిలను డాక్టర్ జగన్నాథం చేస్తున్న వ్యక్తిగత నిర్లక్ష్యాన్ని గుర్తించి వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని జిల్లా ఎమ్మెల్యే గారికి స్థానిక కలెక్టర్ గారికి తెలియజేస్తున్నాము vck విముక్త చిరుతల పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం నిర్మించినటువంటి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజల క్షేమాన్ని కోరుకోవలసిన డాక్టర్లే ఇలా అమాయకమైన ప్రజలను ఇబ్బంది పెట్టడం చాలా బాధాకరమని ఆయన అన్నారు గ్రామాల్లో నిరక్షరాశులుగా బ్రతుకుతూ మానసికమైన బాధలతో ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రిని నమ్ముకొని డాక్టర్లే దేవుళ్ళుగా భావించే ప్రజలను మానసికంగా మాటలతో హింసించడం పేషంట్లను నీచంగా చూడటం చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డాక్టర్లకి ఒక అలవాటుగా మారిపోయింది హాస్పటల్లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించి ప్రజలను హింసిస్తున్నటువంటి ఈ ఇద్దరు డాక్టర్లను వెంటనే సస్పెండ్ చేసి ప్రజలకు మంచి వైద్యాన్నిచ్చి ప్రజలను ఆదుకునే డాక్టర్లను



హాస్పటల్లో నియమించాలని కోరుకుంటున్నాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము స్థానిక కలెక్టర్ ఆస్పత్రిని తనిఖీ చేయాలని అధికారులను డిమాండ్ చేస్తున్నాము

## అద్విక్ కుటుంబానికి న్యాయం చేయాలి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు






హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్


ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ టీచర్స్ కాలనీలో మే 11న కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారి అద్విక్ కుటుంబ సభ్యులను బిజెపి పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జ్ మరియు మేడ్చల్ జిల్లా ప్రభరి సామ రంగారెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు మరియు గడ్డి అన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు, కొత్తపేట్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్ గారు పరామర్శించి,చిన్నారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అద్విక్ ఎల్బీనగర్‌లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని చికిత్సకు సంబంధించిన ఆసుపత్రి బిల్లు మొత్తం ₹11,85,503.79 కు చేరుకుంది. ఘటన జరిగిన సమయంలో లచ్చి రెడ్డి గారు బిజెపి పార్టీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి ఎం యం సి కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ మరియు సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి చిన్నారి అద్విక్ చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరించాలని కోరడం జరిగింది స్పందించిన ప్రభుత్వ అధికారులు చిన్నారి అద్విక్ అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం భరిస్తుందని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఆసుపత్రి యాజమాన్యం బిల్లు చెల్లించాలని కుటుంబ సభ్యులపై ఒత్తిడి తీసుకురావడం, ఈ విషయంలో అధికారులు స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా లచ్చి రెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో కూడా అమలు కావాలని అన్నారు. తీవ్ర విషాదాన్ని ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాన్ని ఈ పరిస్థితిలో నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదన్నారు. అద్విక్ చికిత్సకు సంబంధించిన మొత్తం ఖర్చును ప్రభుత్వం వెంటనే విడుదల చేసి కుటుంబానికి అండగా నిలవాలని మరియు ఒక ఇందిరమ్మ ఇల్లును ప్రకటించాలని డిమాండ్ చేశారు.అలాగే అద్విక్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అతని విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలను కూడా ప్రభుత్వం అందించాలని కోరారు. బాధిత కుటుంబ సభ్యులు అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని, వెంటనే సంబంధిత శాఖలు స్పందించి న్యాయం చేయాలని అన్నారు.

ఈ నేపథ్యంలో అద్విక్ కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ లచ్చి రెడ్డి గారి దృష్టికి తీసుకురాగా, వారు వెంటనే స్పందించి బీజేపీ నాయకులతో కలిసి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహతో (IAS) గారిని వారి కార్యాలయంలో కలిసి సమస్యను వివరించారు.కుక్కల దాడి ఘటన, ఆసుపత్రి బిల్లు సమస్యతో పాటు అద్విక్ విద్యకు ప్రభుత్వం సహకరించాలని బీజేపీ నాయకులు జోనల్ కమిషనర్‌ను కోరారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ శ్రీ వికాస్ మహతో గారు సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అద్విక్ పూర్తిగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేష్, శ్రీధర్ రెడ్డి, మహేష్, సతీష్, రఘునందన్ జోషి మరియు అద్విక్ తండ్రి సుమన్, కేతాన్ తదితరులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భారత నౌకలపై దాడి చేసింది ఇరాన్

### : ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న భారత నౌకలపై దాడులకు పాల్పడింది ఇరాన్ అని ఆయన ధ్వజమెత్తారు. ఇరాన్ డ్రోన్లతో దాడులు చేసిందని తెలిపారు. అదేవిధంగా, ఇరు దేశాల మధ్య సాగుతున్న శాంతి చర్చల నిబంధనల విషయంలో ఇరాన్ అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. శుక్రవారం తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

"గత రాత్రి హర్మూజ్ జలసంధిలో భారత నౌకలపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడులు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అయితే, ఏ నౌకపై జరిగిన దాడి గురించి మాట్లాడుతున్నారో, మాట్లాడుతున్నారో, అందుకు తగిన ఆధారాలేమిటనే అంశాలను ట్రంప్ స్పష్టంగా పేర్కొనలేదు. ప్రస్తుతం ఇరాన్ నుంచి ఈ ఆరోపణలపై ఎటువంటి స్పందన రాలేదు. శాంతి చర్చలకు సంబంధించి ఇరాన్ వెల్లడిస్తున్న సమాచారానికి, వాస్తవ ఒప్పందాలకు పొంతన లేదని ట్రంప్ ఆరోపించారు.గత కొంతకాలంగా హర్మూజ్ జలసంధి కేంద్రంగా అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇరాన్ చమురు ఎగుమతులను అడ్డుకోవడానికి అమెరికా నౌకా దిగ్బంధనాన్ని అమలు చేస్తుండగా, ప్రతిగా ఇరాన్ సైతం వాణిజ్య నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించింది. ఈ క్రమంలోనే ఇటీవల చోటుచేసుకున్న పలు పరిణామాల్లో భారత నావికులు ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. సెట్టిబెల్లో, మారివెక్స్ వంటి నౌకలపై అమెరికా దళాలు జరిపిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మరణించగా, ఈ ఘటనలపై భారత విదేశాంగ శాఖ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
13 శనివారం జూన్ 2026

# TG-20లో కప్ సాధిస్తే నెల జీతం జట్టుకే..

### – కాళోజీ కళాక్షేత్రంలో ఘనంగా వరంగల్ వారియర్స్ గ్రీట్ అండ్ మీట్ కార్యక్రమం..

### – వరంగల్ వారియర్స్‌కు ఎమ్మెల్యే నాయిని భరోసా..



హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో TG`20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వరంగల్ వారియర్స్ జట్టు గ్రీట్ అండ్ మీట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి యువ నాయకులు విష్ణు రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధితో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తోందని అన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చిన ఆయన, ౧+–20 టోర్నమెంట్‌లో వరంగల్ వారియర్స్ జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి కప్‌ను సాధించాలని ఆకాంక్షించారు. వరంగల్ పేరు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగేలా జట్టు రాణించాలని కోరారు. వరంగల్ వారియర్స్ జట్టు ౧+–20 టోర్నమెంట్ విజేతగా నిలిచి కప్‌ను సాధిస్తే తన ఒక నెల ఎమ్మెల్యే జీతాన్ని జట్టుకు ప్రోత్సాహకంగా అందజేస్తానని ప్రకటించారు. స్థానికంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్రాక్టీసింగ్ చేసుకునే విధంగా జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడానని అన్నాయ్ రకాల వసతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. యువ నాయకులు విష్ణు రెడ్డి మాట్లాడుతూ యువ క్రికెటర్లకు ప్రోత్సాహం అందించేందుకు వరంగల్ వారియర్స్ జట్టు చేస్తున్న కృషిని అభినందించారు. క్రీడా రంగంలో వరంగల్ యువత మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ వారియర్స్ టీమ్ కో–ఓనర్స్ ఫణి చిత్తినేని, వరుణ్ జూపల్లి, ధీరజ్ ఇందూరు, జట్టు కోచ్, జట్టు సభ్యులు, క్రీడాకారులు,:తదితరులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# పటిష్ట ప్రణాళికతో పరకాల మహిళా డెయిరీని విజయవంతం చేయాలి

## - పరకాల నియోజకవర్గం ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి,



పటిష్ట ప్రణాళిక, సమర్థవంతమైన నిర్వహణతో పరకాల మహిళా డెయిరీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో పరకాల మహిళా డెయిరీ పనుల పురోగతి, పాల ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యూహాలపై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వివిధ పాల బ్రాండ్ల విక్రయాలు, వినియోగదారుల అభిరుచులు, పోటీ పరిస్థితులు, పరకాల మహిళా డెయిరీ ద్వారా మార్కెట్లోకి తీసుకురానున్న పాల ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాలపై విస్తృతంగా చర్చించారు. మహిళల ఆర్థిక సాధికారతకు ఈ డెయిరీ ఒక ఆదర్శవంతమైన వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

పరకాల మహిళా డెయిరీని గొప్ప లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాల సేకరణ, ఉత్పత్తి, నాణ్యత, మార్కెటింగ్ అనే నాలుగు అంశాలు డెయిరీ విజయానికి కీలకమని పేర్కొన్నారు. డెయిరీ ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం లభించడంతో పాటు, సంస్థకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం కూడా ముఖ్యమని అన్నారు. పాల ఉత్పత్తుల విక్రయాల కోసం రిటైలర్లు, మిల్క్ పార్లర్ల ఎంపికను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రెండు లీటర్లకు పైగా పాలు సరఫరా చేసే రైతులు, ఒక లీటర్ కంటే తక్కువ పాలు సరఫరా చేసే రైతుల వివరాలను వర్గీకరించి సమగ్ర డేటా సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. డెయిరీకి పాలు సరఫరా చేసే రైతులకు వారం లేదా పది రోజుల వ్యవధిలోనే చెల్లింపులు జరిగేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రైతుల విశ్వాసమే డెయిరీకి బలమని పేర్కొన్నారు. మొదటి దశలో పాల ఉత్పత్తుల విక్రయాలపై దృష్టి సారిస్తున్నామని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా వినియోగదారుల విశ్వాసాన్ని గెలుచుకోవాలని అన్నారు. మార్కెట్లో పోటీని తట్టుకునేలా సమర్థవంతమైన బ్రాండింగ్, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

పరకాల మహిళా డెయిరీ నిజాయితీ, నిబద్ధత, పారదర్శకతను పెట్టుబడిగా పెట్టుకుని ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం కరపత్రాలు, ప్రచార సామగ్రి రూపొందించి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. డెయిరీకి పాలు సరఫరా చేసే రైతులకు బోనస్, గ్రూప్ ఇన్సూరెన్స్, పశు బీమా వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎఫ్‌పీసీ (ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ) బ్యాంకు ఖాతాను వెంటనే ప్రారంభించి, ప్రాథమిక సంఘాల సభ్యుల వాటాధనం, సభ్యత్వ రుసుములను సంబంధిత ఖాతాలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, అదనపు డీఆర్‌డీఓ వెంకటేశ్వర్లు, డీపీఎం సరిత, ఏపీఎం దివాకర్‌రాయ్, పరకాల మహిళా డెయిరీ జనరల్ మేనేజర్ కృష్ణ, మెప్మా డీఎంసీలు రజిత రాణి, రేణుక, టీఎంసీలు వెంకట్‌రెడ్డి, రమేష్, సీవోలు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలు నైపుణ్యాలు పెంచుకోవాలి...

## మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి)



మారుతున్న రాజకీయ పరిస్థితులకు తగ్గట్టు కార్యకర్తలు నైపుణ్యాలను పెంచుకోవడం కోసం పార్టీ పరంగా ఇచ్చే శిక్షణ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు ( బాబి) అన్నారు. మండలంలోని తుమ్మపాల గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్సు ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద ఆదేశాల మేరకు మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కర్రి వెంకట సన్యాసినాయుడు అధ్యక్షున మండల టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ పోలింగ్ బూత్ నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు పార్టీ యంత్రాంగం మొత్తం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) విషయంలో పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. ఓటర్ లిస్టులో అవకతవకల కారణంగా ఎన్నికల ఫలితాలు తారుమారైపోతున్నాయని, పశ్చిమ బెంగాల్ లో అనేక ఏళ్లుగా పోలవుతున్న బంగ్లాదేశీయులు, చొరబాటుదారుల ఓట్లను ఉదహరించారు. ఓటర్ లిస్టుల్లో చోటు చేసుకుంటున్న గందరగోళం కొన్ని పార్టీలకు వరంగా మారుతోందని పేర్కొన్నారు. నిజమైన ఓటర్ల పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తప్పుల్లేని ఓటర్ లిస్టు అందుబాటులోకి తీసుకురాగలిగితే ఎన్నికల పని సగానికి పైగా పూర్తయినట్టేనన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో.. అలాగే సాధారణ ఎన్నికల్లో బూత్ స్థాయుల్లో 2024 ఎన్నికల కంటే ఎక్కువ ఓట్లు రావాలని మంత్రి నారా లోకేష్ చెప్పిన విషయాన్ని అందరూ సవాల్ గా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మండలంలోని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సేనాపతి స్వరూప,క్లస్టర్ ఇంచార్జీలు ఆడారి గోవిందా రావు, తలారి కాశీ నాయుడు, బత్తుల రమేష్, ప్రధాన కార్యదర్శి నంబరి శ్రీనివాసరావు, ఎం ఎస్ ఎన్, చందక నరసింగ రావు, యూనిట్, కో క్లస్టర్, బూత్ ఇంచార్జీలు, మహిళలు, కార్యకర్తలు,పాత వార్డు టీడీపీ అధ్యక్షులు కార్యదర్శిలు, తెలుగు యువత సభ్యులు పాల్గొన్నారు.

## సీఎంగా బాధ్యతల తర్వాత తొలిసారి.. ప్రధాని మోదీతో డీకే శివకుమార్ భేటీ



కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డీకే శివకుమార్ తొలిసారిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. గురువారం ఢిల్లీలో ఈ భేటీ జరిగింది. కర్ణాటక రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా ఆయన ప్రధానిని కోరారు.

జూన్ 3న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్, తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం నీతి ఆయోగ్ సమావేశాలను బహిష్కరించగా, అందుకు భిన్నంగా శివకుమార్ ఈ సమావేశానికి హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంతో సమన్వయంతో పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనే సంకేతాలను ఆయన ఈ సందర్భంగా ఇచ్చారు. ప్రధానితో భేటీకి ముందు శివకుమార్ కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలివేటెడ్ కారిడార్లు, పెరిఫెరల్ రింగ్ రోడ్లు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని కోరారు. బెంగళూరు మెట్రో ఫేజ్–2 సవరించిన అంచనాలకు, అలాగే ఫేజ్–3 ప్రాజెక్టుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు బెంగళూరు నుంచి మైసూరు, తుమకూరు, కోలార్ నగరాలను అనుసంధానిస్తూ రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటుపై కూడా చర్చించారు. ప్రధాని మోదీతో జరిపిన చర్చలు అత్యంత ఫలప్రదంగా, నిర్మాణాత్మకంగా సాగాయని శివకుమార్ వెల్లడించారు. రాష్ట్ర సంక్షేమం, ప్రగతి కోసం కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని గతంలో ప్రధాని ఇచ్చిన హామీని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# కాజిపేట వైఎస్సార్ నగర్ పేదల భూమిని కబ్జాకోరుల నుండి కాపాడాలి.

### - 300 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కాంగ్రెస్ నేతల కుట్రలు

### - స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దీని పై బాధ్యత వహించి సమాధానం చెప్పాలి.

### - ఈ స్థలాన్ని ఐటిఐ, జూనియర్ కాలేజీ, ఆస్పత్రి లేదా ప్రభుత్వసంస్థలకు కేటాయించాలి.

### - పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తాం.

### - బిజెపి రాష్ట్ర నాయకురాలు రావు పద్మ



కాజీపేట మండల కేంద్రంలోని వైఎస్సార్ నగర్ గుడిసెవాసులను బెదిరించి, దాదాపు 300రూపాయల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు కాంగ్రెస్ నేతలు కుట్రలు పన్నుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి విమర్శించారు. గురువారం నాడు కాజీపేట బిజెపి నాయకులతో కలిసి వైయస్సార్ నగర్ సందర్శించి అక్కడి గుడిసేవాసులతో కలిసి మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్సార్ నగర్ లోని పేద ప్రజలు గత నాలుగు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలు చేసి ఈ స్థలాన్ని కాపాడుకుంటున్నారని గుర్తుచేశారు. అలాంటి విలువైన ప్రభుత్వ భూమిని కార్పొరేట్ శక్తులకు, కాంగ్రెస్ అనుచరులకు, అలాగే భూకబ్జా కేసుల్లో జైలు శిక్ష పడి ప్రస్తుతం బెయిల్ పై వచ్చిన కబ్జాదారులకు కట్టబెట్టాలని చూస్తే, చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారానికి స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయకుండా, ప్రజల అవసరాల కొరకు ఐటీఐ,ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఆస్పత్రి లేదా ఏసీపీ ఆఫీస్ లాంటి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాల కోసమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. పేదలను దోచి పెద్దలకు కట్టబెడతాం అంటే సహించేది లేదు అని ఆమె స్పష్టం చేశారు. వైఎస్సార్ నగర్ లో దశాబ్దాలుగా నివసిస్తున్న పేద ప్రజలకు వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఇక్కడి అర్హులకు ప్రభుత్వ ఖర్చుతో పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. బలవంతంగా లేదా మోసపూరిత హామీలతో పేదలను ఇక్కడి నుండి ఖాళీ చేయిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ప్రభుత్వం, స్థానిక అధికార యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి పేదలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధితులను కలుపుకొని బీజేపీ పక్షాన పెద్ద ఎత్తున క్షేత్రస్థాయి పోరాటాలు,ఆందోళనలు ఉధృతం చేస్తామని రావు పద్మారెడ్డి హెచ్చరించారు.

ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి జిల్లా నేతలు ఆకుల శ్రీకాంత్ పటేల్, నర్మెట్ట శ్రీనివాస్ రావు, తోపుచర్ల అర్చన, స్థానిక బిజెపి నాయకులు కాయిత రాజ్ కుమార్, మేకల శ్రావణ్, రేణుకుంట్ల కల్యాణ్, తిరుపతి నాయక్, భగవాన్ ఉపాధ్యాయ, ఆదిత్య సాయి, చాంద్ పాషా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

## – వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రైత్ సింగ్,



విధులను నిర్వహించకుండా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు తెలియజేసారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని గురువారం కిట్స్ కళాశాల సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తోలి సారిగా గతంలో ఎన్నడు లేని విధంగా సిసిటిఎనఎస్ అప్లికేషన్ 2.0 ద్వారా పోలీస్ కమిషనర్ పరిధిలోని పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు కేసుల దర్యాప్తు, నేర నియంత్రణ కోసం సంబంధిత పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్య లపై పోలీస్ కమీషనర్ అనలైన్ పద్ధతిలో సంబంధిత స్టేషన్ అధికారులను అడిగి తెలుకోవడంతో పాటు, పెండింగ్ కేసుల, కేసుల పురోగతికై తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులు సూచనలు, సలహాలను అందజేసారు. అనంతరం అధికారులను ఉద్యేశిస్తూ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా వెళ్ళి తనిఖీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో విద్యా సంస్థల 100 మీటర్ల పరిధిలో ఎలాంటి పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుందా తగు చర్యలు తీసుకో వాలని, రానున్న విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకోని విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను పాఠశాలలకు తరలించే స్కూల్ బస్ల స్థితిగతులపై స్థానిక పోలీస్ అధికారులు వ్యక్తిగతం వెళ్ళి బస్సులను తనిఖీ చేయాలని. ఇటీవల హైదరాబాద్ లో జరిగిన వరుస సంఘటనలను దృష్టిలో వుంచుకోని నగరంలో నేపాల్ దేశానికి చెందిన పౌరులు ఎక్కడ పనిచేస్తున్నారు, ఎక్కడ నివస్తున్నారు, ముఖ్యంగా ఇండ్లల్లో పనిచేసే వారి వివరాలను సేకరించాలని రాబోవు లోక్ ఆదాలత్ ద్వారా పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా అధికారులు కృషి చేయాలని, పెండింగ్ కేసులను పరిష్కరించడంతో పాటు, పెండింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను త్వరగా పరిష్కారించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.

ఈ సమావేశం లో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, దార కవిత, అదనపు డిసిపిలు రవి, బాలస్వామి, ప్రభా కర్రావు, సురేష్కుమార్తో పాటు ఏసిపిలు, ఇన్స్ స్పెక్ట ర్లు. సబ్ ఇన్సెస్పెక్టర్లు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## 'పెద్ది'ని తొక్కేయడానికి కొందరు కావాలనే అడ్డుపడుతున్నారు: జగపతిబాబు ఫైర్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో వచ్చిన 'పెద్ది' సూపర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివిటీని తట్టుకుని, బాక్సాఫీస్ వద్ద బలమైన టాక్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో సీనియర్ నటుడు జగపతిబాబు, దర్శకుడు బుచ్చిబాబుల మధ్య జరిగిన ఒక ఆసక్తికర సంభాషణ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో ఒక అద్భుతమైన పాత్రను పోషించిన జగపతిబాబు, సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నారు. 'పెద్ది' చిత్రం తెలుగు చిత్ర పరిశ్రమకు సరికొత్త ఊపిరి పోస్తుందంటూ గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని జగపతిబాబు చెప్పారు.

ఈ సినిమా ప్రయాణం గురించి ఆయన మాట్లాడుతూ.. "ఈ సినిమాలో చరణ్ ఒక ఆట ఆడాడు, కష్టపడి పోరాడి గెలిచాడు. కానీ దురదృష్టవశాత్తూ నేటి పరిశ్రమలో గెలిచిన తర్వాత కూడా ఇంకా పోరాడుతూనే ఉండాల్సి వస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. రామ్ చరణ్‌పై ప్రశంసలు కురిపిస్తూ.. 'చరణ్ ప్రతి షాట్‌లోనూ సిక్సర్ కొట్టాడు' అని కొనియాడారు. సినిమాను తొక్కేయడానికి కొందరు కావాలనే ప్లాన్డ్ నెగిటివిటీని ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలిరోజుల్లో వచ్చిన బాక్సాఫీస్ రెస్పాన్స్‌పై జగపతిబాబు ఓపెన్‌గా స్పందించారు. మొదట రెండు మూడు రోజులు కలెక్షన్లు ఆశించిన స్థాయిలో లేవని, అసలైన ప్రేక్షకులు థియేటర్లకు పూర్తి స్థాయిలో రాలేదని అంగీకరించారు. అయితే రోజులు గడిచేకొద్దీ మౌత్ టాక్ మారిపోయిందన్నారు.



"ఇప్పుడు టాక్ పూర్తిగా పాజిటివ్‌గా మారింది. ఫ్యామిలీ ఆడియన్స్ భారీగా థియేటర్లకు వస్తున్నారు. సినిమా ఇంత బాగుంటే, కొందరు ఎలా ఇంత నెగిటివ్ ప్రచారం చేశారో అర్థం కావడం లేదని కొందరు నాతో అన్నారు" అని చెప్పారు.

## సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్ అయిన తర్వాత జరిగే హడావుడిపై నందినీ రెడ్డి ఏం చెప్పారంటే..!



టాలీవుడ్ లో ప్రేక్షకులను ఆకట్టుకున్న పలు చిత్రాలను తెరకెక్కించిన నందినీ రెడ్డి టాలెంటెడ్ మహిళా దర్శకురాలిగా గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం సమంత ప్రధాన పాత్రలో నటించిన తన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదల పనుల్లో ఆమె తలమునకలై ఉన్నారు. ఈ సినిమా ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సినిమా విడుదల నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా, సినిమా విడుదలకు ముందు ఉండే హడావుడి గురించి నందినీ రెడ్డి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "విడుదల తేదీ ప్రకటించనంత వరకు పనులు చాలా నెమ్మదిగా, ప్రశాంతంగా సాగుతాయి. ఒక్కసారి విడుదల తేదీ ఖరారైన వెంటనే టెక్నీషియన్లందరూ తమ పనులను పూర్తి చేయడానికి పూర్తి వేగంతో శ్రమిస్తారు. సినిమా అవుట్‌పుట్‌ను ముందుగానే సిద్ధం చేస్తే, మళ్లీ ఏదో మార్పులు చేయాల్సి వస్తుందేమో అని చివరి దశలో పనులు పూర్తి చేస్తారు. అందుకే విడుదల తేదీ ఫిక్స్ అయిన తర్వాత హడావుడి పెరుగుతుంది" అని ఆమె తెలిపారు. మరోవైపు, సమంత-నందినీ రెడ్డి కాంబినేషన్‌లో వస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

## చిరంజీవి 'మెగా158' పొల్లాచ్చి షెడ్యూల్ పూర్తి



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, యువ దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం చవీవస్త్రు158. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా తమిళనాడులోని పొల్లాచ్చిలో చేపట్టిన కీలక షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. ఈ విషయాన్ని దర్శకుడు బాబీ కొల్లి గురువారం తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఈ షెడ్యూల్‌లో కొన్ని అద్భుతమైన సన్నివేశాలను చిత్రీకరించినట్లు ఆయన తెలిపారు.

"పొల్లాచ్చిలో చవీవస్త్రు158కు సంబంధించిన ఒక ఎలక్ట్రిఫైయింగ్ షెడ్యూల్ విజయవంతంగా పూర్తయింది. కొన్ని అద్భుతమైన సన్నివేశాలు చాలా అందంగా రూపుదిద్దుకుంటున్నాయి. మరిన్ని ఉత్తేజకరమైన అప్‌డేట్‌లు రాబోతున్నాయి" అని బాబీ తన పోస్టులో పేర్కొన్నారు. గత వారమే ప్రారంభమైన ఈ షెడ్యూల్‌లో మెగాస్టార్ చిరంజీవితో పాటు ప్రధాన తారాగణం పాల్గొని కీలక సన్నివేశాల చిత్రీకరణలో పాల్గొన్నారు. ఈ సినిమా ద్వారా మలయాళ యువ నటి అనశ్వర రాజన్ తెలుగు తెరకు పరిచయం కాబోతున్నారు. ఇటీవల చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఆమెను ప్రాజెక్టులోకి స్వాగతిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. బ్లాక్‌బస్టర్ హిట్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో చవీవస్త్రు158పై మెగా అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ నిర్మిస్తున్నారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, 'జైలర్', 'డాకు మహారాజ్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో గుర్తింపు పొందిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ కెమెరా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొల్లా అవినాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా, ఆంటోనీ రూబెన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది చిరంజీవి పుట్టినరోజున ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. ఈ పాత్ర కోసం మెగాస్టార్ ఎంతగా శ్రమిస్తున్నారో తెలియజేస్తూ ఇటీవల జిమ్‌లో కసరత్తులు చేస్తున్న వీడియోను పంచుకున్నారు. 'పరిమితులను అధిగమించడానికి ప్రతిరోజూ ఒక కొత్త అవకాశం. చవీవస్త్రు158 కోసం నా ప్రియమైన బాబీతో మరో చిరస్మరణీయ ప్రయాణానికి సిద్ధమవుతున్నాను' అని ఆ వీడియోకు క్యాప్షన్ జోడించారు. సినిమా ప్రకటన పోస్టర్‌లో గొడ్డలితో పగిలిన గోడ, రక్తపు మరకలతో పాటు 'ది బ్లేడ్ దట్ సెట్ ది బ్లడీ బెంచ్‌మార్క్' అనే ట్యాగ్‌లైన్ ఉండటం సినిమా ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో సూచించింది. తదుపరి షెడ్యూల్, ఇతర నటీనటుల వివరాలపై త్వరలోనే స్పష్టత రానుంది.



## వదంతులకు చెక్.. ఆ విషయంలో క్లారిటీ ఇచ్చిన డైరెక్టర్ దేవా కట్టా



టాలీవుడ్ విలక్షణ దర్శకుడు దేవా కట్టా తన తదుపరి ప్రాజెక్టుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. తాను ఏ ఇతర సినిమాకు పనిచేయడం లేదని, పూర్తిగా తన సొంత సినిమా పనుల్లోనే నిమగ్నమై ఉన్నానని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' లో ఓ కీలక ప్రకటన చేశారు. "గత కొంతకాలంగా నా తదుపరి సినిమా రచన, అభివృద్ధి పనులతోనే ఎక్కువ సమయం గడుపుతున్నాను. నా రాబోయే ప్రయాణం కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను" అని దేవా కట్టా తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

అదే సమయంలో తనపై వస్తున్న కొన్ని వదంతులను ఆయన తీవ్రంగా ఖండించారు. "కొన్ని క్లిక్స్ కోసం దురుద్దేశంతో ప్రచారంలో ఉన్న పుకార్లకు స్పష్టత ఇస్తున్నాను. నేను ఏ ఇతర సినిమాకు ఒక్క షాట్ కూడా దర్శకత్వం వహించడం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. తన తదుపరి చిత్రాన్ని కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదిగా అభివర్ణించారు. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడిస్తానని తెలిపారు. 'ప్రస్థానం', 'రిపబ్లిక్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దేవా కట్టా ప్రకటనతో ఆయన తదుపరి సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## గ్లామర్ డోస్ పెంచిన రుహానీ శర్మ!



టాలీవుడ్ అందాల భామ రుహానీ శర్మ సరికొత్త ఫొటోషూట్‌తో నెటిజన్లను ఫిదా చేస్తోంది. జూన్ నెలలో ఇన్డోర్‌లో జరిగిన ఈ షూట్‌లో ఆమె పింక్ కలర్ కార్డిగాన్, డెనిమ్ జీన్స్ వేసుకుని చాలా స్టైలిష్‌గా కనిపించింది. సోఫాపై కూర్చుని, తన కాన్ఫిడెంట్ లుక్స్‌తో, ప్రశాంతమైన హావభావాలతో కుర్రకారు మనసు దోచుకుంటోంది. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో సెన్సేషన్‌గా మారిన రుహానీ లేటెస్ట్ లుక్స్ , ఆమె కెరీర్ విశేషాలు మీకోసం. అదిరిపోయిన స్టైలింగ్: ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో రుహానీ లుక్ చాలా సింపుల్‌గా, అంతే ఎలిగెంట్‌గా ఉంది. సాఫ్ట్ పింక్ కలర్ వాఫిల్-నిట్ కార్డిగాన్ టాప్‌కి జతగా బ్లూ కలర్ డిస్ట్రెస్డ్ డెనిమ్ జీన్స్ వేసుకుంది. ఇక ప్రముఖ ఫొటోగ్రాఫర్ భరత్ రావల్ ఈ ఫొటోలను అద్భుతంగా క్లిక్ చేయగా, శైలి అజ్మీరా స్టైలింగ్ చేశారు. శ్రేయా జైన్ వేసిన మేకప్ రుహానీ అందాన్ని మరింత రెట్టింపు చేసింది. మోడలింగ్ నుండి సినిమాల్లోకి: హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్‌లో 1994, సెప్టెంబర్ 18న జన్మించిన రుహానీ శర్మ, మొదట మోడలింగ్‌లో తన కెరీర్ ప్రారంభించింది. ఇక ఆ తర్వాత 2017లో 'కడైసి బెంచ్ కార్తీ' అనే తమిళ సినిమాతో నటిగా మారింది. అయితే, ఆమెకు అసలైన బ్రేక్ ఇచ్చింది మాత్రం మన టాలీవుడ్ సినిమానే. 'చి ల సౌ'తో సూపర్ క్రేజ్: సుశాంత్ హీరోగా వచ్చిన 'చి ల సౌ' సినిమాతో రుహానీ తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమాలో తన సహజమైన నటనతో అందరి మనసులు గెలుచుకుంది. ఇక ఆ తర్వాత 'హిట్: ది ఫస్ట్ కేస్'లో నేహా పాత్రలో, వెంకటేష్ సరసన 'సైంధవ్' సినిమాలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. వీటితో పాటు మలయాళంలో 'కమల', హిందీలో 'ఆగ్రా' వంటి విభిన్న చిత్రాల్లోనూ మెరిసింది. చేతినిండా ప్రాజెక్టులతో: రుహానీ కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటోంది. ఇక 2026లో ఆమె చేతిలో క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. అల్లరి నరేష్ సరసన 'ఆల్కహాల్' అనే తెలుగు సినిమాలో నటిస్తోంది. కమర్షియల్ సినిమాలతో పాటు కంటెంట్ ఉన్న కథలను ఎంచుకుంటూ రుహానీ శర్మ ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. ఇక అటు గ్లామరస్ ఫొటోషూట్లతో సోషల్ మీడియాను షేక్ చేస్తూ, ఇటు వైవిధ్యమైన సినిమాలతో దూసుకుపోతున్న ఈ హిమాచల్ బ్యూటీ రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆశిద్దాం.

## అన్నీ కుదిరాయి... 'ఓజీ2' వస్తోందట!


పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులకు చిత్ర యూనిట్ తీపి కబురు అందించింది. ఆయన కథానాయకుడిగా నటించిన బ్లాక్ బస్టర్ హిట్ 'దే కాల్ హిమ్ ఓజీ' (ఓజీ) చిత్రానికి సీక్వెల్ రాబోతున్నట్లు అధికారికంగా ధ్రువీకరించారు. ఈ ప్రాజెక్టుపై దర్శకుడు సుజీత్ విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత చర్చలు ప్రారంభిస్తామని పవన్ కల్యాణ్ సొంత నిర్మాణ సంస్థ 'పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' గురువారం వెల్లడించింది. "ఇచ్చిన మాట ప్రకారం ఆయన వస్తారు.. సమయం ఆయనే నిర్ణయిస్తారు. సుజీత్ విదేశాల నుంచి తిరిగి రాగానే చూ+2 గురించి చర్చిస్తాం" అని నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో, ఆయన సినిమాలకు విరామం ఇస్తారంటూ వస్తున్న ఊహాగానాలకు ఈ ప్రకటనతో తెరపడింది.



2025 సెప్టెంబర్‌లో విడుదలైన 'ఓజీ' చిత్రంలో పవన్ కల్యాణ్ 'ఓజస్ గంభీరా' అనే గ్యాంగ్‌స్టర్ పాత్రలో ప్రేక్షకులను అలరించారు. సుజీత్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తొలుత మిశ్రమ స్పందనలు అందుకున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.300 కోట్ల వసూళ్లను రాబట్టి భారీ విజయాన్ని నమోదు చేసింది. తమన్ అందించిన నేపథ్య సంగీతం, హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న దర్శకుడు సుజీత్, సీక్వెల్ స్క్రిప్ట్‌పై ఇప్పటికే కసరత్తులు చేస్తున్నట్లు సమాచారం. ఆయన స్వదేశానికి చేరుకున్న తర్వాత ఈ ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో చర్చలు జరగనున్నాయి. అయితే షూటింగ్ ప్రారంభ తేదీ, ఇతర నటీనటుల వివరాలను చిత్ర యూనిట్ ఇంకా వెల్లడించలేదు. ఈ తాజా అప్‌డేట్‌తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

## కళ్ళతోనే మాయ చేస్తూ చెమటలు పట్టిస్తున్న సేవ్ ది టైగర్స్ బ్యూటీ!

1993 మే 30న న్యూఢిల్లీలో జన్మించిన దేవియాని శర్మ తన అద్భుతమైన నటనతో నటన రంగంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది. ఇండస్ట్రీలోకి రాకముందు మోడల్ గా తన కెరీర్ను ప్రారంభించిన ఈ చిన్నది.. ఆ తర్వాత తొలిసారి హిందీ చిత్రం లవ్ షూధా అనే చిత్రంలో అతిథి పాత్ర పోషించి సినీ రంగ ప్రవేశం చేసింది. 2020లో భానుమతి రామకృష్ణ అనే చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమైన దేవియాని శర్మ.. 2021 లో వచ్చిన రొమాంటిక్ , 2022లో ఝాన్సీ చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఇలా ఎన్నో చిత్రాలలో నటించినప్పటికీ ఈమెకు మంచి గుర్తింపును అందించిన సిరీస్ మాత్రం సేవ్ ద టైగర్స్ అనే చెప్పాలి. ఈ సిరీస్ లో తన అద్భుతమైన నటనతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంది. రెండు సీజన్లు పూర్తి చేసుకున్న ఈ సిరీస్.. జూన్ 19వ తేదీ నుండి ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ జియో హాట్ స్టార్ వేదికగా మూడవ సీజన్ స్ట్రీమింగ్ కి సిద్ధమవుతోంది. ఇక ఎప్పటిలాగే ఈసారి కూడా ఈ మూడు జంటలు ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమైపోయారు. పైగా ఈ సీజన్లో వెన్నెల కిషోర్ కూడా తన కామెడీతో ఆకట్టుకోవడానికి రాబోతున్నారు. మరి జూన్ 19వ తేదీ నుండి జియో హాట్ స్టార్ వేదికగా స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్ ప్రేక్షకులను ఏ విధంగా మెప్పిస్తుందో చూడాలి.



మరొకవైపు ఈ సిరీస్ ప్రమోషన్స్ లో భాగంగా దేవియాని శర్మ గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తూ.. సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. అందులో భాగంగానే తాజాగా మరో ఔట్ఫిట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. స్కై బ్లూ కలర్ హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ బాడీ కాన్ టాప్ ధరించి తన అందాలతో మెస్మరైజ్ చేసింది. మత్తెక్కించే కళ్ళతో రొమాంటిక్గా ఫోటోలకు ఫోజులిస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇక అమ్మడి అందానికి.. గ్లామర్ లుక్కుకి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఇకపోతే ఈమె హెయిర్ స్టైల్ విషయానికి వస్తే.. పాపిడి తీసి జుట్టును ముడిపెట్టిన ఈమె.. కళ్ళ మీదకు ఒక చిన్న లేయర్ లాగా జుట్టును వదిలేసి స్టైలిష్ గా ఆకట్టుకుంది. ఈ ఫోటోలకు క్యాప్షన్ గా విశ్వం నా అందాన్ని చూసి గుసగుసలాడుతోంది. నేను నా హృదయంతో ఆ గుసగుసలను వింటున్నాను అంటూ షేర్ చేసింది. మొత్తానికైతే సరికొత్త ఫోటోషూట్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చి అటు గ్లామర్ తో గిలిగింతలు పెడుతోంది దేవియాని శర్మ. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

